రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# పెండ్లి ఇంట్లో చోరీ

## -బంగారం, వెండి అపహరణ

**మేడ్చల్, మార్చి 19. ప్రభాతవార్త :** కన్న కూతురు రిసెప్షన్‌కు వెళ్లివచ్చేసరికి పెండ్లి ఇంట్లో చోరి జరిగిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన రమేష్ తన కూతురు పెండ్లిని ఆదివారం నిర్వహించగా, సోమవారం మేడ్చల్ పట్టణంలోని ఫంక్షన్ హాలులో జరిగిన ఆమె రిసెప్షన్‌కు కుటుంబ సభ్యులు ఇంటింకి తాళం వేసి వెళ్లారు. అనంతరం ఇంటికి తిరిగి రాగా ఇంటి తాళం పగుల గొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా నాలుగు తులాల బంగారం, 60 తులాల వెండి వస్తువులతో పాటు నగదు చోరీకి గుర్హైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదఉ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

# తూంకుంట పెద్ద చెరువుకు ఎఫ్‌టిఎల్ హద్దురాళ్ల ఏర్పాటు

## -ఎఫ్‌టిఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు : కమిషనర్

## -పాల్గొన్న ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు

**శామీర్‌పేట, మార్చి 19, ప్రభాతవార్త**



తూంకుంట పెద్ద చెరువులో ఎఫ్‌టిఎల్ ఏర్పాటు చేస్తున్న అధికారుల దృశ్యం

తూంకుంట పెద్ద చెరువుకు ఎఫ్‌టిఎల్ ఏర్పాటుకు ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సర్వే నిర్వహించి హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ కేంద్రంలోని తూంకుంట పెద్ద చెరువుకు ఎఫ్‌టిఎల్ ఏర్పాటుకు అధికారులు సర్వే నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధిత ఆయా శాఖల అధికారులు పాల్గొని సర్వే చేసి ఎఫ్‌టిఎల్ బౌండరీని, ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లను గుర్తించి హద్దురాళ్లను ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. దీనిలో ఇరిగేషన్ శాఖ నుంచి డిఇఇ సురేశ్, ఎఇ ప్రశాంత్, రెవెన్యూశాఖ నుంచి సర్వేయర్ యాదగిరి, గిర్దావర్ కుమార్, పురపాలక శాఖ నుంచి కమిషనర్ వెంకట గోపాల్, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ కరుణాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అక్రమ నిర్మాణాలను కూడ ఉపేక్షింబోమని మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ స్పష్టం చేశారు. గత కొన్నేళ్ల నుంచి తూంకుంట పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్ సర్వే చేసి హద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతు న్న సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వ ఆదేశాలతో ఎట్టకేలకు తూంకుంట పెద్ద చెరువును ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల సంబందిత అధికారులు సందర్శించటం సర్వే చేసి ఎఫ్‌టిఎల్ సరిహద్దుల ను, ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్లను గుర్తించటం చర్చనీ యాంశంగ మారింది. తూంకుంట పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరిగితే సహిం చేది లేదని ఆయా శాఖల అధికారులు కూడ స్పష్టం చేయటం జరిగింది.

# వాహనాల తనిఖీలు..రూ.3 లక్షలు స్వాధీనం



ఘట్‌కేసర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న సిఐ సైదులు, ఎస్ఐలు

**ఘట్‌కేసర్, మార్చి 19, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. అవుషాపూర్‌లో జాతీయరహదారిపై ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా సరి హద్దు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఘట్‌కేసర్ సమీపంలోని ఓఆర్ఆర్ టోల్‌ప్లాజా, సర్వీస్ రోడ్లపై ప్రత్యేక పార్టీ బృందం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మంగళవారం ఘట్‌కేసర్‌లో ఎదులా బాద్ రోడ్డుపై సామాజిక ఆసుపత్రి వద్ద పోలీసులు వాహనాలను ఆపి చెక్ చేశారు. ఘట్‌కేసర్ మున్సి పల్ కొండాపూర్‌కు చెందిన డ్రైవర్ జవాజీ బాలక్రిష్ణ (36) కారులో వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేయగా రూ.3 లక్షల నగదు ఉండటంతో ఆధారాలపై ఆరా తీయగా ఏలాంటి పత్రాలు ఇవ్వలేక పోవ డంతో సీజ్ చేశారు. ఘట్‌కేసర్ అంబేద్కర్ చౌరస్తాలో ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదులు, ఎస్ఐలు అశోక్, రా మునాయక్, సిబ్బంది బైక్‌లు, కార్లను ఆపి తనిఖీ చేశారు. తనిఖీలో స్వాధీనం చేసుకున్న రూ.3 లక్షల నగదును మేడ్చల్ జిల్లా ట్రెజరీ ఖాతాలో డిపాజిట్ చేసి జిల్లా గ్రీవియెన్స్ కమిటీకి సమాచారం ఇచ్చినట్లు సీఐ సైదులు తెలిపారు.

# కేంద్రంలో మోడీ ప్రభుత్వం రావడం ఖాయం




కరీంగూడ గ్రామంలో "ప్రశ్నిస్తున్న తెలంగాణ సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ

**కీసర, మార్చి19, ప్రభాతవార్తః**

కేంద్రంలో మోడీ ప్రభుత్వం రావడం ఖాయమని రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండలంలోని కరీంగూడ గ్రామంలో "ప్రశ్నిస్తున్న తెలంగాణ సమావేశం" నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ పరిపాలన ఏరు దాటకముందు ఓడ మల్లయ్య ఏరు దాటాక బోడ మల్లయ్య అన్న చందంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూటకోక్క మాట చెప్పి ప్రజలను మోసం చేస్తుందన్నారు. తెలంగాణ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టిన తరువాత కూడా బుద్ది రాలేదన్నారు. ప్రజలకు చేయలేని హామీలు, వాగ్దానాలు ఇచ్చి అర చేతిలో వైకుంఠం చూపిస్తున్నాడన్నారు. నిరుద్యోగులకు వంద రోజుల్లో లక్షల్లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పి వారిని మోసం చేశాడన్నారు. ఎన్నికల ముందు మహిళలకు 2500 వందలు ఇస్తామని చెప్పి ఇప్పుడు తెల్ల రేషన్ కార్డు ఉంటేనే ఇస్తామనడం ఏందన్నారు. గత ప్రభుత్వం రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తామని మోసం చేశారని, రాష్ట్రం 7 లక్షల కోట్లు అప్పుల్లో ఉంటే సీఎం రేవంత్ రైతులకు 2 లక్షల రుణమాఫీ ఎలా ఇస్తారన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం పెట్టి ఆర్‌టిసిని 350 కోట్ల అప్పుల్లో పడేసిందన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం పెట్టి 15 మంది ఆటో కార్మికులు ఆత్మహత్యకు రేవంత్‌రెడ్డి కారణమయ్యాడన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఎకరాకు 40 వేల చొప్పున ఎరువులు, విత్తనాలకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి ఇస్తున్న ఫసల్ భీమా రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు 1.5 లక్షల అప్పులు చేసిందన్నారు. రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల రైతులు అల్లాడుతున్నారని అయినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఓట్ల కోసం వంద రోజుల్లో రైతులకు వరికి 5 వందల బోనస్, 2 లక్షల రుణమాఫీ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. మల్కాజిగిరి ఎంపి బిజేపి అభ్యర్ధి ఈటల రాజేందర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మద్యం బెల్ట్ దుఖాణాల వల్ల 10,700 కోట్ల ఆదాయం వస్తే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 45 వేల కోట్ల ఆదాయం వస్తుందన్నారు. బెల్ట్ షాపుల వల్ల రాష్ట్రంలో ఏ ఒక్క ఆడబిడ్డ సుఖంగా లేదన్నారు. 2018 నుంచి బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి చేయలేదు గాని కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల రుణమాఫీ చేయడం ఎలా సాధ్యమవుతుందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఏనాడు 24 గంటల కరెంటు ఇచ్చింది లేదన్నారు. గ్రామీణ ప్రాంతంలో రైతులకు 24 గంటల కరెంటు ఇస్తామని రైతులను బిఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ప్రజలకు 6 గ్యారెంటీలు కాదు 66 గ్యారెంటీలు అమలు చేయాలని, 420 హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు విక్రంరెడ్డి, కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జాతీయ కిసాన్ మోర్చ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూధన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు అంజయ్య యాదవ్, జగన్‌మోహన్‌రెడ్డి, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బుద్ది శ్రీనివాస్, శోభారెడ్డి, జిల్లాల తిరుమల్‌రెడ్డి, అమరం మోహన్‌రెడ్డి, నర్సింహ్మా, వెంకట్‌రెడ్డి, కాలేరు రామోజీ, మునుగంటి సురేష్, దేశం మల్లేష్ గౌడ్, శ్యాం సుందర్ శర్మ, బుచ్చిరెడ్డి, రాగుల అశోక్ కుమార్, బోడ శ్రీనివాస్, చినింగణి సుధాకర్, కోల బాలరాజు యాదవ్, వంగేటి బాపిరెడ్డి, బండారు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తూర్ కేంద్రంలో పట్టుబడ్డ గంజాయి



పట్టుబడ్డ గంజాయి

**కొత్తూర్, మార్చి 19, ప్రభాతవార్త :**


కొత్తూర్ మండల కేంద్రంలో మరోసారి గంజాయి పట్టుబడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... ఇద్దరు వ్యక్తులు కొత్తూర్ మండల కేంద్రంలో అనుమానస్పదంగా సంచరిస్తు ండడంతో వారిని ఎస్ఓటి పోలీసులు సోదా చేయగా వారి దగ్గర 320 గ్రాముల గంజాయి లభ్యమైంది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొత్తూర్ మండల కేంద్రంలోని నారాయణగూడ కాలేజీ చెందిన ప్రకాష్ శంషాబాద్‌లోని రాళ్లగూడ నాగేంద్ర కాలనీకి చెందిన గొరిగే వెంకటేష్ శంషాబాద్‌లోని తాగుడు అడ్డ దగ్గర పరిచయమై గంజాయి ఇలాంటి వ్యాసనాలకు అలవాటు పడి డబ్బుల కోసం హైదరాబాద్‌లోని దూల్‌పేట్ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి వాటిని చిన్నచిన్న ప్యాకెట్లుగా విభజించి కొత్తూర్ పారిశ్రామిక వాడలోని లేబర్ అడ్డాల దగ్గర విక్రయానికి పాల్పడుతుండగా పట్టుబడ్డారు.

# చింతచెట్టుపై నుండి కిందపడి వ్యక్తి మృతి

**పూడూరు, మార్చి 19, ప్రభాతవార్త :**

చింతచెట్టుపైనుండి కిందపడి ఓవ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలోని పెద్ద ఉమ్మెంతాలలో చోటు చేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ మధసూధన్‌రెడ్డి కథనం ప్రకారం పూడూరు మండలం పరిధిలోని సిరిగాయపల్లి గ్రామానికి చెందిన అంబటి నారాయణ (53) అనే వ్యక్తి మంగళవారం ఉదయం సుమారు 8గంటల ప్రాంతంలో తన సొంత పొలానికి వెళతానని భార్య లక్ష్మీకిచెప్పి ఇంటినుండి బయలుదేరి వెళ్లాడు. అయితే పెద్దఉమ్మెంతాల్ గ్రామానికి చెందిన బ్యాగరి సుభాష్‌వద్ద ఉన్న చింతచెట్టుపై పండును రాల్చేందుకు చెట్టుపైకి ఎక్కాడు. మధ్యాహ్నం సుమారు ఒంటిగ ప్రాంతంలో చింతపండు రాల్పుతుండగా ప్రమాదావషత్తు చింతకొమ్మ విరిగి జారికింద పడడంతో అంబటి నారాయణ (53) తలకు, కాళ్లకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని సిరిగాయపల్లి గ్రామానికి చెందిన శ్రీజగని బాలయ్య ద్వారా తెలుసుకున్న మృతుని భార్య లక్ష్మీ సంఘటన స్థలానికి వెళ్లిచూసి తనభర్త నారాయణ మృతి చెందినట్లు నిర్ధారించుకొని పోలీసులకు పిర్యాదు చేయగా, ఈ మేరకు చెన్‌గోముల్ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# బైకుల దొంగ అరెస్ట్



బైక్‌లు దొంగతనాలు చేసిన వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

**కీసర, మార్చి19, ప్రభాతవార్తః**

బైకులను దొంగతనం చేస్తున్న వ్యక్తిని కీసర పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సిఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి మారుతీ గార్డెన్ దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పద రీతిలో బైక్ నడుపుతున్న ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించగా అతనిపై మొత్తం ఆరు కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. సాగర్ (23) స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. రాంపల్లిలో ఒక ఇల్లును అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాడు. అతనికి చిన్ననాటి స్నేహితుడు రాహుల్‌తో కలసి మద్యానికి అలవాటు పడి ఆన్‌లైన్ గేమ్‌లు ఆడటం వంటి అనేక చెడు అలవాట్లకు, వ్యసనాలకు అలవాటు పడ్డాడు. వారి అలవాట్లకు కుటుంబ అవసరాలకు, విలాసాల కోరికలకు ప్రైవేట్ ఉద్యోగం ద్వారా వచ్చే సంపాదన సరిపోలేదు. దీంతో తమ అవసరాలను తీర్చుకోవడానికి ఒక ప్రణాళికను రూపొందించుకున్నారు. ఉప్పల్, బోయిన్‌పల్లి, పిఎస్‌లలో బైక్‌లను కమీషన్ ద్వారా వారి ప్లాన్‌ను అమలు చేశారు. ఇదివరకే ఒకసారి జైలుకు వెళ్లి వచ్చాడు. అయినా తన అవసరాలను తీర్చుకోవడానికి బైక్‌ల దొంగతనాలను ఎంచుకున్నాడు. ఈ కేసును కీసర పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఎన్నికల విధులను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలి

## -జిల్లా కలెక్టర్ శశాంక

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్, మార్చి 19 ప్రభాతవార్త :**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.శశాంక

ఎంతో బాధ్యతతో కూడుకుని ఉండే ఎన్నికల విధులను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కె.శశాంక సూచించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని స్టాస్టిక్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర నిఘా అధికారులకు మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాయ సముదాయ భవనంలో సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ శశాంక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయా పార్టీలు అభ్యర్థుల ప్రచార సరళీ పరిశీలన, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను నిరోదించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీల నిర్వహణ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మూడు టీంలు ఏర్పాటు చేసి ప్రతి టీమ్ ఎనిమిది గంటల విధులు నిర్వర్తించే విధంగా డ్యూటీలు కేటాయించడం జరిగిందని తెలిపారు. వాహనంలో లాగ్ బుక్కులు రాయాలని తెలిపారు. ఎన్నికల్లో నిఘా బృందాలు సమర్థవంతంగా నిబద్దతో తమ బాధ్యత నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించాలని, అన్ని పార్టీలు, అభ్యర్థుల పట్ల నిబంధనలకు అనుగుణంగా సమదృష్టితో వ్యవహారించాలన్నారు. తమపట్ల వివక్షను ప్రదర్శించారనే ఫిర్యాదులు రాకుండా పక్కాగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎన్నికల ప్రవర్తన నియామవళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా వాస్తవాలను నిర్ధారించి తగు చర్యలు తీసుకోవాలని సూచించానరు. నిఘా బృందాల దృష్టిని మళ్లించేందుకు పలువురు చేసే తుప్పడు ఫిర్యాదుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, అలాంటి వాటిపై తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. ఎన్నికల వ్యయం ప్రచార సరళిపై నిఘా బృందాలు అనునిత్యం 24 గంటల నిఘా ఉండాలని, ఈ మేరకు పూరినత స్థాయిలో బృందాలను ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. స్టాస్టిక్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర బృందాలకు సమకూర్చిన వవాహనాలకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన పీ.టీ.జీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా నిఘా బృందాల పనితీరును కలెక్టర్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని, నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అన్నారు. యాభై వేల నుంచి పది లక్షల మధ్య డబ్బుల లావాదేవీలు జరిగితే కచ్చితంగా రశీదు ఉండాలని పేర్కొన్నారు. 10లక్షలపైన లావాదేవీలు ఉంటే ఆదాయ పన్నుశాఖ పరిధిలోకి వెళ్తుందని చెప్పారు. ముఖ్యంగా తనిఖీల సమయంలో సాధారణ ప్రజలకు అనవసర ఇబ్బందులు ఏర్పకుండా సమన్వయంతో వ్యవహరించాలని, నగదును జప్తు చేసిన సందర్భాలలో తగు రీతిలో పంచనామ నిర్వహించి తప్పనిసరిగా రశీదులను అందించాలని ఆదేశించారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా ఉప ఎన్నికల అధికారిణి ప్రతిమసింగ్, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సంగీత, ఎమ్‌సిసి నోడల్ అధికారి సౌమ్య, ఎన్నికల వ్యయం నోడల్ అధికారి సురేష్ మోహన్, ఏ.ఆర్‌ఈఓలు, పోలీస్ అధికారులు, ఎస్.ఎస్.టి.ఎఫ్.ఎస్.టీ.వీఎస్‌టీ టీంలు సంబందిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కనుల పండుగగా శ్రీ దాక్షాయణి రామలింగేశ్వర స్వామి కళ్యాణం



శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు



స్వామి వారి కళ్యానోత్సవం లో పాల్గొన్న భక్తులు

**మేడ్చల్, మార్చి 19. ప్రభాతవార్త :**

మేడ్చల్ పట్టణంలోని ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ దాక్షాయణి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయలంలో స్వామి కళ్యాణ రథ మహోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా గత ఆరు రోజుల నుండి నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి కళ్యాణ మతోత్సవం నిర్వహించారు. ఆలయం మందు భాగంలోని మండపంలో మంత్రోత్సరణలతో వేద పండితులు కళ్యాణాన్ని కనుల పండుగగా జరిపారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి కళ్యాణాన్ని తిలగించి, అనంతరం స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అదే విదంగా మంగళవారం ఉదయం అగ్నిగుండాలు, గజ వాహన సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దాత్రిక రాధాకృష్ణ, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## జన్వాడ బాధితులకు న్యాయం చేయాలి

**చేవెళ్ల, మార్చి 19 ప్రభాతవార్త :** జన్వాడ బాధితులకు న్యాయం చేయాలని క్రిస్టియన్ ఫెలోషిఫ్ తెలంగాణ రాష్ట్ర టిడిఎస్ మని, ఆలిండియా క్రిస్టియన్ ఫెలోషిప్ తెలంగాణ ఆధ్వర్యంలో మౌంట్ కర్మేల్ చర్చ్‌లో క్రైస్తవ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జన్వాడ బాధితులకు న్యాయం చేయాలన్నారు. వారిపైన ఉన్న కేసులు వెంటనే ఎత్తి వేయాలన్నారు. నష్టపరిహారం చెల్లించి, దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ అసెంబ్లీ ముఖ్య నాయకులు, పాస్టర్ జహాంగీర్, ఎలియాజార్, ప్రభుదాసు, క్రిస్టోఫర్, దానియేల్, సుదర్శన్, జోసెఫ్, పురుషోత్తం, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

# పదవతరగతి పరీక్షా కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ గౌతమ్

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి) మార్చి 19, ప్రభాతవార్త**



అలియాబాద్‌లో పదవతరగతి పరీక్షా కేంద్రాలను సందర్శించి పరిశీలించిన జిల్లా కలెక్టర్ గౌతమ్, పాల్గొన్న తదితరులు

జిల్లాలో జరుగుతున్న పదవతరగతి పరీక్షా కేంద్రాలను మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సందర్శించి పరీక్షల సరళిని పరిశీలించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, సమీప సెంట్‌జోసఫ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆ రెండు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ నెల 18న పదవతరగతి పరీక్షలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 46,766మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగ, వీరిలో మంగళవారం 46,643మంది విద్యార్థులు జిల్లా వ్యాప్తంగ హజరై పరీక్షలు రాసినట్లు కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. 17మంది ప్రైవేట్ విద్యార్థులకు గాను 7మంది మాత్రమే పరీక్షలకు హాజరు కావటం జరిగిందన్నారు. జిల్లాలో మాస్ కాపి జరగకుండ చూడాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను, త్రాగునీటి సౌకర్యాలను, కనీస మౌళిక సదుపాయాల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఎండల దృష్ట్యా వైద్య శిబిరం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఎక్కడ కూడ పొరపాట్లకు తావివ్వకుండ నిబంధనల మేరకు పరీక్షలను నిర్వహించాలన్నారు. పరీక్షా పత్రాలు, జవాబు పత్రాల రవాణా పోలీస్ ఎస్కాట్‌తో చేయాలన్నారు. మొబైల్‌ఫోన్లను కేంద్రంలోకి అనుమతించవద్దని, విద్యార్థులతో పాటు సిబ్బందిని ఫ్రిస్కింగ్ చేపట్టి, తనిఖీ తరువాతనే అనుమతించాలని కలెక్టర్ అన్నారు. భద్రతా సిబ్బంది అప్రమత్తంగ ఉంటూ అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. జిల్లా కలెక్టర్ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, మండల విద్యా అధికారి వసంతకుమారి, పరీక్షా కేంద్రాల ఛీఫ్ సూపరిండెంట్స్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సెక్టోరల్ అధికారులు సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలి : జిల్లా కలెక్టర్ శశాంక

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్, మార్చి 19 ప్రభాతవార్త :** ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.శశాంక తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో మంగళవారం ఎన్నికల సెక్టోరల్ అధికారులకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా సెక్టోరల్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు పరిశీలించాల్సిన విషయాలపై అంశాల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం నియమనిబంధనలకు లోబడి నిర్వర్తించాల్సిన విధుల గురించి తెలియజేస్తూ రూపొందించిన హ్యాండ్ బుక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో నెలకొని ఉన్న పరిస్థితులను ముందుగానే గమనిస్తూ ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారుల దృష్టికి తేవాలని, సెక్టోరల్ అధికారులకు సూచించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా సెక్టోరల్ అధికారులు అందరూ సమర్థవంతంగా విధుదు నిర్వర్తించాలని అన్నారు. ప్రస్తుతం కూడా అదే స్ఫూర్తితో మరింత బాధ్యతాయుతంగా పని చేయాలని, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. ఇదివరకు పనిచేశాం కదా దనే భావనతో విధులను ఎంత మాత్రం తేలికగా తీసుకోకూడదని, ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని జాగ్రత్తలు సూచించారు. ఎవరైనా విధుల పట్ల అలసత్వాన్ని ప్రదర్శిస్తూ నిర్లక్ష్యానికి తావిస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రధానంగా ఓటర్లను ఓటు హక్కు వినియోగించుకోకుండా నిలువరించే వారిని, అలాగే ఓటర్లను ప్రభావితం చేసే వారిపై ఓటు పెట్టి ఎన్నికల నిబంధలకు అనుగుణంగా కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని సూచించారు. అలాంటి పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక జాబితాలో చేరిస్తే, పోలీసుల సహాయంతో జిల్లా యంత్రాంగం తరుపున ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా ఉప ఎన్నికల అదికారిణి ప్రతిమసింగ్, ఎన్నికల శిక్షణ అధికారి సంగీత, ఎమ్.సి.సి నోడల్ అధికారి సౌమ్య, ఎన్నికల వ్యయం నోడల్ అదికారి సురేష్ మోహన్, ఎఆర్ఈఓలు, సెక్టోరల్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో
# 23. 24 డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బేగంపేట మార్చి 19,ప్రభాతవార్త: బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ స్టడీ సెంటర్ లో మహిళా విధ్యార్థినులకు డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ డా.మారోజు రమాచారి వెల్లడించారు.వివిధ డిగ్రీ కోర్సుల అడ్మిషన్లకు ఇంటర్మీడియట్ పూర్తయిన లేక ఓపెన్ ఇంటర్ లేదా పాలిటెక్నిక్ మూడు సంవత్సరాల కోర్సు పూర్త యిన, ఐటిఐ కోర్సు పూర్తి చేసిన వారు దరఖాస్తులు ఇచ్చేందుకు అర్హులన్నారు.దూరవిద్య(డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా చదువుకోవాలనుకునే వారికోసం డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాల యం డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు.2023,2024అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశాలకు కావాల్సిన అర్హతలు, దరఖాస్తు వివరాలు ముఖ్యమైన తేదీలను వెల్లడించింది. డిగ్రీలో బీఏ,బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు మార్చి 31వ తేదీ చివరి తేదీ అని మారోజు రమాచారి తెలియజేసారు.

## కోదండ రామాలయం దేవాలయ కమిటీ నూతన పాలకవర్గం ఎన్నిక


ఎమ్మెల్యే వివేకానందను కలిసిన సభ్యులు

పేట్‌బషీరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద 132 జీడిమెట్ల డివిజన్ ప్రసూన్న నగర్ నూతన సంక్షేమ సంఘం కార్యవర్గం సభ్యులు, శ్రీశ్రీశ్రీ కోదండ రామాలయం దేవాలయ నూతన పాలకవర్గం సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే కెపి వివేకానందను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రసూన్న నగర్ కాలనీ వాసులు మాట్లాడుతూ గత పదేళ్ళ కాలంలో కాలనీలో నెలకొని ఉన్న సమస్యలను అన్నింటిని పరిష్కరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రసూన్న నగర్ నూతన సంక్షేమ సంఘం అధ్యక్షులు రాంచందర్, ప్రధాన కార్యదర్శి సిద్దులుగౌడ్, కోశాధికారి జి.రమేష్, సభ్యులు ఆర్.సుబ్బారావు, కె.నాగేంద్రబాబు, శ్రీశ్రీశ్రీ కోదండ రామాలయం దేవాలయ నూతన పాలక వర్గం అధ్యక్షులు జి.సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి నాగచంద్రారెడ్డి, కోశాధికారి మద్దిలేటి, సభ్యులు సికె ఆశ, యు.సుజాత, శైలజ, జె.నాగేశ్వరరావు, కాలనీ వాసులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పిల్లల పెంపకంలో లింగ వివక్ష చూపొద్దు

**సెంట్రల్ ఉమెన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ చందన**


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్ఐ చందన

ముషీరాబాద్, మార్చి 19, ప్రభాత వార్త: తల్లి తండ్రులు పిల్లల పెంపకంలో లింగవివక్ష చూపకూడదని, ఆడపిల్ల అయినా మగ పిల్లవాడయినా ఒక్కటిగానే పెంచాలని సెంట్రల్ ఉమెన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ చందన సూచించారు. మంగళవారం దోమలగూడలోని బండానగర్ కమ్యూనిటీహాల్ నందు అప్సా స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో, ఒక్క రూపాయి ఛాలెంజ్ ఫౌండేషన్ సహకారంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్మయి షీలా, జర్నలిస్ట్ పి.నాగవాణి, అప్స సీనియర్ కోఆర్డినేటర్ బొట్టు రమేష్, ప్రతినిధులు శ్రావణి, లావణ్య, అగన్‌వాడి టీచర్లు పుష్ప, నర్సమ్మ, సరస్వతి, బీజేపీ సీనియర్ నాయకులు కుమార్‌గౌడ్, బస్తీ మహిళలు పాల్గొన్నారు.

## బ్యాలెట్ పత్రాల ద్వారానే ఎన్నికలు నిర్వహించాలి

**డిబిపి అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్**



సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

సైఫాబాద్, మార్చి 19 ప్రభాత వార్త: ఈవిఎం టాంపరింగ్‌ల ద్వారా పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించడానికి కేంద్ర ఎన్నికల కమిషన్‌తో బిజెపి ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం కుమ్మక్కైయిందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాజ్యాంగ బద్ధ స్వతంత్ర హౌదా కలిగిన సంస్థలను కలుషితం చేశాయని, ఇందులో భాగంగా (కేంద్ర ఎన్నికల కమిషన్) ఇసిఐని తమ గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపించారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో 400 ఎంసి సీట్లు వస్తున్నాయని, అంబేద్కర్ రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని ఆ పార్టీ ఎంపి హెగ్డే ద్వారా బిజెపి ప్రకటనలు చేప్పిస్తున్నదని ఆయన తెలిపారు. మంగళవారం పార్టీ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వడ్లమూరి మాట్లాడుతూ ఇవిఎం టాంపరింగ్‌లకు సహకరించమని కేంద్ర ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ మీద వత్తిడీ తీసుకురావడం వల్లనే ఆయన పదవికి రాజీనామా చేశారని ఆరోపించారు. . బ్యాలెట్ పత్రాల ద్వారానే ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు షేక్ భాషా , బీరం సతీష్‌కుమార్, ఇటీకాల గణేష్, శంబురెడ్డి పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్ తదితరులు

**రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్**

చిక్కడపల్లి, మార్చి 19 ప్రభాత వార్త: కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు 'లభర్తి సంపర్క్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని రాజ్యసభ సభ్యుడు, బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో బిజెపి సీనియర్ నేత నైషదం సత్యనారాయణమూర్తితో కలిసి జరిగిన కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సంధ్బంగా ఫసల్ బీమా యోజన కింద లబ్దిదారులకు అండగా కేంద్రం నిలిచిందన్నారు. కేంద్రం ద్వారా లబ్దిపొందుతున్న వారికి ప్రధానమంత్రి మోదీ పిలుపులో భాగంగా డివిజన్‌కు చెందదిన పుట్టలక్ష్మయ్య, గొల్లపల్లి పద్మావతి గౌడ్, జహంగీర్‌బీ, సుధాగణి లక్ష్మి,కె.శ్రీరేణుక, జ్యోతి, మహిప్రియ వంటి ఔత్సాహిక మహిళలను కలిసి వారివారి వృత్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు నైషదం సత్యనారాయణమూర్తి, కార్పొరేటర్ చారి, నేతలు నవీన్‌మూదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు అరుణ్, ఉపేందర్ దితరులు పాల్గొన్నారు.

# నిరాధారణ ఆరోపణలు సరికాదు

**బిఆర్ఎస్ నేత ఆంజనేయులు**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేత ఆంజనేయులు

దుండిగల్, మార్చి 19 ప్రభాతవార్త: డబ్బులు డిమాండ్ చేశారంటూ తనపై వచ్చిన ఆరోపణలను బిఆర్ఎస్ సీనియర్ నేత ఎంబరి ఆంజనేయులు కొట్టిపారేశారు. ఈమేరకు మంగళవారం ఆయన జిఎల్‌సి క్రైబ్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ విజయలక్ష్మీ అనే బిల్డర్‌కు మేము 15ఎకరాల స్థలం ఇప్పించడం జరిగింది. ఇండిపెండెంట్ ఇళ్ళ నిర్మాణాలు చేపడితే అన్ని విధాలుగా సహకరించాము. రియల్ సంస్థలు రావడం ద్వారా మాఊరి అభివృద్ధి త్వరితంగా జరుగుతుందని వారికి సహకరిస్తూ ప్రోత్సహించాము. నాలుగు రోజుల క్రితం జిఎల్‌సి క్రైబ్స్‌లో పార్కు విషయంలో గుర్తు తెలియని వ్యక్తులు గొడవ చేస్తున్నారని స్థానికుల సమాచారంతో ఇక్కడికి చేరుకున్నాము. వచ్చిన వారు మహిళలపై దుర్భషలాడుతుంటే సరికాదని చెప్పి మీ వద్ద ఏమైనా పత్రాలు ఉంటే న్యాయం పరంగా వెళ్ళాలే తప్పా గొడవ చేయకూడదని సర్ది చెప్పాము. ఈవిషయంలో నేను డబ్బులు డిమాండ్ చేస్తున్నానని, కాలనీవాసులను రెచ్చగొడుతున్నానని అని విజయలక్ష్మీ పేర్కొనడం పూర్తిగా అవాస్తవం. ఇళ్ళ నిర్మాణం జరిగిన ప్రాంతాన్ని సర్వే చేసి వారు కొనుగోలు చేసిన 15 ఎకరాలకు పైగా స్థలం ఉంటే అట్టి స్థలంలో పార్కు, ఆలయం నిర్మించాలని కోరారు.

### అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 19 ప్రభాతవార్త : నిబంధనలకు విరుద్దంగా కిరాణాషాపులో మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను మైలార్‌దైవ్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ముగ్గురు వ్యక్తల నుంచి 21 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. శివరాంపల్లి ప్రాంతానికి చెందిన ఓ దుకాణంలో నిబంధనలకు విరుద్దంగా పలు రకాల మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కిరాణా షాపుపై దాడి జరిపి 21 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నారు.


బాధితురాలికి నగలను అప్పగిస్తున్న పోలీసులు

## బంగారు నగల్ని రెండు గంటల్లో ఛేదించిన పోలీసులు

కొంపల్లి, మార్చి 19, ప్రభాతవార్త: బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో ఒక మహిళ ప్రయాణికురాలు తిరుమల కవిత ఖమ్మంలోని ఆర్టీసి బస్సు ఎక్కి ప్రగతినగర్, బాచుపల్లిలోని విజేత సూపర్ మార్కెట్ బస్‌స్టాప్ వద్ద బసు దిగి తన కూతురు ఇంటికి వెళ్ళే సమయంలో మార్గం మద్యలో తన వద్ద ఉన్న 4 తులాల బంగారు ఆభరణాలు కలిగిన బ్యాగును పోగొట్టుకుంది. ఈ విషయాన్ని బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేయగా, పోలీసుల విచారణ జరిపి రెండు గంటల వ్యవధిలో ఆమెకు పోగొట్టుకున్న 4 తులాల బంగారు ఆభరణాలు కలిగిన బ్యాగును స్వాధీనం చేసుకుని తిరిగి బాధితురాలికి అందజేయడం జరిగింది. బాచుపల్లి పోలీసులు చేసిన మంచి పనికి కూకట్‌పల్లి ఏసీపీ, బాలానగర్ డీసీపీలు ఈ కేసును ఛేదించిన సిబ్బందిని అభినందించారు.

## విద్యార్థుల అవగాహన కోసం ఫుడ్ ఫెస్టివల్ అవసరం


ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న భాస్కరరావు

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 19, ప్రభాతవార్త : విద్యార్థుల అవగాహన కోసం ఫుడ్ ఫెస్టివల్‌ను కాశాలలో ఏర్పాటు చేయడం అవసరమని సిద్ధార్థ మహిళా డిగ్రీ కళాశాల చైర్మన్ గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు పేర్కొన్నారు. మంగళవారం కూకట్‌పల్లిలోని సిద్ధార్థ ఉమెన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆహార వితరణ సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశాన్ని కళాశాల చైర్మన్ గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని దీనివల్ల ప్రతి ఒక్కరికి అవగాహన ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు మధుసూదన్‌రావు, అరవింద్‌రావు, ప్రిన్సిపల్ పద్మప్రియ, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య మిత్రులకు ఉద్యోగ భద్రత కల్పించాలి


ప్రసంగిస్తున్న రాష్ట్ర ఆరోగ్యమిత్రల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరి యాదయ్య

చిక్కడపల్లి,మార్చి 19ప్రభాతవార్త: తెలంగాణరాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యమిత్రలకు ఉద్యోగభద్రత ఉంటుందని ఆశిస్తున్నామని రాష్ట్ర ఆరోగ్యమిత్రల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరి యాదయ్య, ఎం.కుమార్ పేర్కొన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2007 నుంచి గత 16 సంవత్సరాలుగా ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆరోగ్యమిత్రలుగా విధులు నిర్వహిస్తున్న తమను గుర్తించి, క్యాడర్ ఫైల్‌ను ప్రభుత్వానికి రాజీవ్‌ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి విశాలక్షి పంపించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా సంఘం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లభించిన వెంటనే ఆరోగ్యమిత్ర కుటుంబాలన్నీ ప్రభుత్వానికి అండగా ఉంటాయని, ఉద్యోగభద్రత, టిఎ,డిఎ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కోరారు.

## రైల్వేలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి
### మర్రి రాఘవయ్య

కంటోనె మ్రంట్,మార్చి 19 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఎన్.ఎఫ్.ఐ.ఆర్.జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య పిలుపునిచ్చారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం సికింద్రాబాద్ రైల్ నిలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భారత రైల్వే ఉద్యోగుల న్యాయమైన కోర్కెల సాధనకు దక్షిణ మధ్య రైల్వే చేపట్టనున్న నిరవధిక సమ్మెకు సంబంధించిన అధికారులకు ఇచ్చిన నోటీసులను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలనే డిమాండ్‌పై కేంద్రం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో మంగళవారం మేనేజ్‌మెంట్‌లకు సమ్మె నోటీసులు అందించాలనుకున్నామన్నారు. 2023 నవంబర్‌లో సమేమ బ్యాలెట్ కూడా నిర్వహించినట్లు తెలిపారు. 2024 మే 1 నుంచి రైల్వేలో నిరవధిక సమ్మె చేపట్టేందుకు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. రైల్వే కార్మికుల కృషితో 17శాతం ఆదాయం కేంద్రానికి పెరిగిందనా న్నరు. కానీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు మాత్రం పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ అధ్యక్షులు ప్రభాకర్ ఆంద్రూ, సంఘ్ నేతలు ఎం.భరణి భానుప్రసాద్, రాజ్‌గోపాల్, షేక్ రావుఫ్, ఎం.రుద్రారెడ్డి, పి.ఎస్.నారాయణ, సత్య వాణి, ప్రభురాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధి కోసం మోడీ కృషి : ఈటెల రాజేందర్


మారేడ్‌పల్లి నెహ్రూనగర్ పార్కులో సీనియర్ సిటిజన్లతో సమావేశమైన బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్, కార్పొరేటర్ కొంతం దీపిక, శ్రీగణేష్

కంటోన్మెంట్, మార్చి 19 ప్రభాతవార్త: దేశ పురోభివృద్ధి కోసం, సంక్షేమ పాలన కోసం ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నారని, 3వ సారి కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చేందుకు ప్రజలు బిజెపిని గెలిపించాలని మల్కాజిగిరి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ తెలిపారు. మంగళవారం కంటోన్మెంట్ నియోజకవర్గం వెస్ట్ మారేడ్‌పల్లిలోని నెహ్రూ నగర్ పార్కులో మార్నింగ్ వాకర్ స్తో కలిసి ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్ ఇచ్చి ప్రజల ప్రాణాలు కాపాడిన ఘనత మోదీకే దక్కిందన్నారు. కేంద్ర ప్రభుత్వమైనా, రాష్ట్ర ప్రభుత్వమైనా ఎవరి సొంత ఆస్థులు కాదన్నారు. రాజ్యాంగ బద్ధం ప్రజలు వారికి అధికారం ఇచ్చారన్నారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను ప్రధాని మోదీ సేవకునిగా మాత్రమే పని చేస్తున్నారన్నారు. ఆకలితో ఉన్న వాడితో గొడవ పడకుండా వారిని హక్కున చేర్చుకొని వారికి కష్ట నష్టాలను తీర్చాల్సిన బాధ్యత మనం దరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, కంటోన్మెంట్ బిజెపి ఇన్‌ఛార్జి ఎన్.శ్రీగణేష్, బిజెపి నాయకులు పిట్ల నాగేశ్ ముదిరాజ్, బిజెపి నాయకులు,కార్యకర్తలు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిసి కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి

**చైర్మన్‌తోపాటు అన్నింటికి డైరెక్టర్లను నియమించాలి**

**రాజ్యసభ సభ్యులు అర్.కృష్ణయ్య డిమాండ్**


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ, అనంతయ్య, కోటేశ్వరి తదితరులు

హైదరాబాద్, మార్చి 19,ప్రభాతవార్త: రాష్ట్రంలో 139 బిసికులాలు ఉంటే కేవలం 8 మాత్రమే కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని అన్నింటికి కాకపోయినా 56 వృత్తికులాలకైనా కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని బిసిసంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈమేరకు మంగళవారం విద్యానగర్‌లో బిసికుల ఐక్యవేదిక అధ్యక్షులు అనంతయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి కృష్ణయ్య ముఖ్యతిథిగా హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే ఆకులాలల్లో నాయత్వం పెరిగి ఆకులానికి గుర్తింపు ఇచ్చినట్లవుతుందన్నారు. అలాగే ఆకులానికి సమాజంలో గౌరవం పెరుగుతుందన్నారు. పక్కరాష్ట్రం ఏపీలో 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ప్రతికార్పొరేషన్‌కు ఒకచైర్మన్ 11మంది డైరెక్టర్లను నియమించారన్నారు.

**బిసి విద్యార్థి సంఘం మహిళా అధ్యక్షురాలుగా కోటేశ్వరి నియామకం..** తెలంగాణ బిసి విద్యార్థిసంఘం మహిళా విభాగం అధ్యక్షురాలిగా కోటేశ్వరి ఆర్.కృష్ణయ్య నియమించారు. ఈసందర్భంగా ఆమెకు నియమక పత్రం అందజేసి విద్యార్థుల సమస్యలపై పోరాటం చేయాలని పలుసూచనలు చేశారు. ఈకార్యక్రమంలో బిసి సంక్షేమసంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, నీల వెంకటేష్, రాజేందర్, వంశీకృష్ణ, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణగౌడ్, నర్సింహ్మాగౌడ్, విజయ్‌కుమార్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిషరీస్ కార్పొరేషన్ ముదిరాజ్‌లకు ఇవ్వకపోవడం అన్యాయం

**తెలంగాణ ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర కన్వీనర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్**



సమావేశంలో మాట్లాడున్న గుండ్లపల్లి శ్రీనుముదిరాజ్, అల్లుడు జగన్, గొడుగు శ్రీనివాస్

హైదరాబాద్, మార్చి 19,ప్రభాతవార్త:ఫిషరీస్ కోఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ముదిరాజ్‌లకు కాకుండా ఇతర సామాజిక వర్గానికి ఇవ్వడం సరికాదని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావవేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 85లక్షలకుపైగా జనాభా కలిగిన ముదిరాజ్‌లకు న్యాయం చేస్తామని చెప్పి ఇతరకులానికి కేటాయించి తమకు అన్యాయం చేశారన్నారు. రాష్ట్రంలో నాలుగువేల కుపైగా సహకార సంఘాలు ఉంటే అందులో మూడువేలకు పైగా ముదిరాజ్‌లు ప్రాతినిథ్యం వహిస్తున్నారన్నారు. అలాగే 2003 ఫిబ్రవరి 19న నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం ముదిరాజ్‌లను బిసిడినుంచి బిసిఏలోకి మార్చాల న్నారు. ఈసమావేశంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, తెలంగాణ ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర కోకన్వీనర్ అల్లుడు జగన్ ముదిరాజ్, సమన్వయకర్త బొక్క శ్రీనివాస్ ముదిరాజ్, రంజిత్ పాల్గొన్నారు.

## కెసిఆర్ భేషరతుగా ప్రజలకు క్షమాపణ చెప్పాలి

**టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా**



ముషీరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త: కాంగ్రెస్ వాగ్ధానాలకు ప్రజలు ఆశపడి, తనను ఓడించారు అంటూ కేసీఆర్ వ్యాఖ్యలు చేయటం సరికాదని, తక్షణమే ప్రజలకు క్షమాపణ చెప్పాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. మంగళవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా తెలంగాణ ప్రజలు తనకు పది సంవత్సరాలు అవకాశం ఇచ్చినందుకు కనీసం కృతజ్ఞతలు చెప్పకుండా నిర్లక్ష్యంగా గద్దె దిగిపోయిన కేసీఆర్‌ను ప్రజలు ఓడించింది ఆయనకు, ఆయన కుటుంబానికి ఉన్న అహంకార ధోరణితో ప్రజలు విసిగిపోయి ఓడించారు తప్ప కాంగ్రెస్ చేసిన వాగ్ధానాలకు ఆశపడి కాదని అన్నారు. 1200 మంది ఆత్మ బలిదానాలతో సాధించిన తెలంగాణను నేనే సాధించా అంటూ గొప్పలు చెప్పుకోవటం విచారకరమని, ప్రజాస్వామ్యంలో ప్రజలను విమర్శించటం అంటే ఆకాశం మీద ఉమ్మి వేయటమే అన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ తన వ్యాఖ్యలను మానుకుని, పది సంవత్సరాలు అవకాశం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియచేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, యాదగిరిరావు, ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వట్టినాగులపల్లి కాంగ్రెస్ నాయకులు బుడాల అరుణ్ కుమార్ ముదిరాజ్, కొండె సాయి యాదవ్, మంగళారం శ్రీకాంత్ యాదవ్, మాచర్ల కిషోర్


తెలంగాణ ప్రభుత్వ ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా నియమితులైన జితేందర్‌రెడ్డికి అభినందనలు తెలియజేస్తున్న నలంద విద్యాసంస్థల చైర్మన్ మంతెన శ్రీనివాసరాజు, విద్యావేత్తలు

## మల్లు స్వరాజ్యం పోరాటం నేటి మహిళలకు స్ఫూర్తిదాయకం కావాలి

సైఫాబాద్, మార్చి 19 ప్రభాతవార్త: పేద, అణగారిని వర్గాల అభ్యున్నతి కోసం జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రముఖ స్వాతంత్ర్య సమర పోరాట యోధురాలు, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం చేసిన పోరాటం మరువలేనిదని లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు కొనియాడారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మల్లు స్వరాజ్యం వర్ధంతి సభలో ఆయన ప్రసంగించారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరం మహిళలకు ఆదర్శం కావాలని, నీతి, నిజాయితీలకు, మహిళల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని, చట్ట సభలలో మహిళ బిల్లు తక్షణమే అమలు కోసం ఉద్యమించాలని ఆయన సూచించారు.

## తెలంగాణ యువత, ఉద్యోగార్థుల పక్షాన నిలిచి అండగా ఉంటా

**తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా నియమితులైన రియాజ్**

చిక్కడపల్లి, మార్చి 19 ప్రభాతవార్త: తెలంగాణ యువత, ఉద్యోగార్థుల పక్షాన నిలిచి వారికి అండగా ఉంటానని తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా నియమితులైన మహ్మద్ రియాజ్ అన్నారు. మంగళవారం అశోక్‌నగర్‌లో విష్ణు ఐఏఎస్ అకాడమి అధినేత విష్ణువర్దన్ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా రియాజ్ నియమితులైన సందర్భంగా ఘ నంగా సత్కరించి అభినందించే కార్యక్రమం జరి గింది. ఈ సందర్భంగా విష్ణువర్దన్ మాట్లాడుతూ యువత, ఉద్యోగారులకు అండగా ఉంటూ, వారి పక్షాన గొంతెత్తి ఎల్లప్పుడూ వారి వెన్నంటి ఉంటూ అండగా నిలిచిన వ్యక్తి రియాజ్ సర్ అని అన్నారు. గ్రంథాలయ పరిషత్ చైర్మన్ హోదాలో నిరుద్యోగ యువతకు మరింత ఉపయోగకరమైన కార్యక్రమాలు చేపడుతారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం


సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కమ్మసేవాసమితి సభ్యులు

దుండిగల్, మార్చి 19 ప్రభాతవార్త: తెలంగాణలో కమ్మ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ మంగళవారం దుండిగల్ మున్సిపాలిటీ కమ్మసేవాసమితి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నటువంటి కమ్మవారిని గుర్తించి వారి అభివృద్ధి కోసం కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

## దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ప్రధాని మోడీ కృషి: వినోద్‌కుమార్‌గౌడ్


బేగంపేట విమానాశ్రయంలో ప్రధాని మోదీతో బాలాజీనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు వినోద్‌కుమార్‌గౌడ్

కూకట్‌పల్లి, మార్చి 19 ప్రభాతవార్త: దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రధాని నరేంద్రమోదీ ఎంతో కృషిచేస్తున్నారని 115 బాలాజీనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు వినోద్‌కుమార్ గౌడ్ అన్నారు. రాష్ట్ర పర్యటన నిమిత్తం ప్రధాని వచ్చిన సందర్భంగా బేగంపేట విమానాశ్రయంలో వినోద్‌కుమార్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ అభివృద్ధికి మారుపేరుగా మారిన బిజెపికి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ మద్దతు పలికి తిరిగి బిజెపి అధికారంలోకి వచ్చేందుకు తమ సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ఉదయ్, మనోహార్, నాగరాజు పాల్గొన్నారు.

**కెపిహెచ్‌బి కాలనీ..** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జగిత్యాల సభ ముగించుకుని ఢిల్లీకి బయలుదేరిన భారత ప్రధాని నరేంద్ర మోడీని కూకట్‌పల్లికి చెందిన పలువురు బిజెపి నాయకులు మంగళవారం కలిసి వీడ్కోలు పలి కారు. కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షులు అనంత నాగ రాజు మాట్లాడుతూ బేగంపేట విమానాశ్రయంలో ప్రధాని మోడీని కలిసే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.

## చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగరేస్తాం

**-బీఆర్ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు పీసరి సతీష్‌రెడ్డి**

**షాబాద్, మార్చి 19, ప్రభాతవార్త :**
చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరేస్తామని బీఆర్ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు పీసరి సతీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ....రాబోయే పారమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుని హ్యాట్రిక్ విజయం సాధిస్తామన్నారు. చేవెళ్ల గడ్డ బీఆర్ఎస్ అడ్డ అని అన్నారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. చేవెళ్ల ప్రాంతంమరింత అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

## దేవాలయ వ్యవసాయ భూములు వేలం..

**షాబాద్, మార్చి 19, ప్రభాతవార్త :**
షాబాద్ మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం వ్యవసాయ భూములు వేలం నిర్వహించడం జరుగుతుందని దేవస్థాన ఈవో శ్రీనివాస్ అన్నారు. షాబాద్ గ్రామంలో గల భూములు 3సంవత్సరాల కాలపరిమితితో 1 ఏప్రిల్ 2024నాడు ఉదయం 11గంటలకు దేవస్థానం ఆవరణలో వ్యవసాయ భూములు కౌలు ఇచ్చేందుకు బహిరంగ వేలం వేయడం జరుగుతుందని తెలిపారు.

## ఘనంగా బీరప్ప, మల్లన్న బోనాలు వేడుకలు



స్వామివారిని దర్శించుకున్న అవినాష్‌రెడ్డి

**షాబాద్, మార్చి 19, ప్రభాతవార్త :**
షాబాద్ మండల పరిధిలోని గొల్లూర్‌గూడ గ్రామంలో మంగళవారం బీరప్ప, మల్లన్న బోనాలు ఘనంగా జరిగాయి. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపును నిర్వహించారు. గ్రామస్థులంతా బీరప్ప మల్లన్న ఆలయాలకు తరలి మొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, రూ.50వేల నగదును ఆలయ కమిటీకి అందజేశారు.

## కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న బీఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

**కొత్తూర్, మార్చి 19, ప్రభాతవార్త :**
కొత్తూర్ మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో కొత్తూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, గ్రామ తాజా మాజీ సర్పంచ్ సాయిలు, గ్రామ కా ంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నర్సింలు, రఘు, శ్రీధర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పనిచేసి పార్టీకి విజయానికి సాయపడాలన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నగరి ప్రీతం



ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్‌గా నగరి ప్రీతంకు బొకే అందజేస్తున్న దృశ్యం

**కడ్తాల్,మార్చి 19 ప్రభాతవార్త :**
కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కడ్తాల్ మండల అధ్యక్షులు పోతుగంటి అశోక్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కంబాపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్‌గా నియమితులైన నగరి ప్రీతంను ఎస్సీ సెల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కంబాలపల్లి రామకృష్ణ, ఎస్సీ సెల్ కడ్తాల్ మండల ప్రెసిడెంట్ పోతుగంటి అశోక్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు వస్పుల శ్రీశైలం, ఆమన్‌గల్లు బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ కలిసి బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తలకొండపల్లి ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు ఎదుల శంకర్, అనుమాస్‌పల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వరి పంట సాగుపై రైతులకు అవగాహన

**-రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి మాదవిలత**



.మూడుచింతలపల్లి రైతువేదికలో రైతులకు వరి పంటపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**శామీర్‌పేట, మార్చి 19, ప్రభాతవార్త**
వరి పంట సాగు యాజమాన్య పద్దతులపై రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి ఎస్.మాదవి లత రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం మూడుచింతలపల్లి మండల కేంద్రంలో రైతు వేదికలో రైతులకు వరి పంటల సాగుపై అవగాహన, వరి పంటలను క్షేత్రపర్యటన చేసి రైతులకు పంటల సాగుపై యాజమాన్య పద్దతులను మాదవిలత వివరించారు. వర్మికంపోస్టు లాభాలు, మట్టి పరీక్షలు లాభాలు, ఫలితాల ఆధారంగ ఎరువుల వాడకం గురించి వివరించారు. తరువాత గ్రామంలోని రైతు సదాశివరెడ్డి వరి పొలాలను సందర్శించారు. పంటలో జింక్ అప్లై చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ సుధీర్‌కుమార్, సంబంధిత వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఎంపీ రంజిత్‌రెడ్డి చేరికతో...

**-మండల కాంగ్రెస్,బీఆర్ఎస్ నాయకులు అయోమయం**
**-రాజకీయ పరిణామాలతో**
**ఎటు తేల్చుకోలేకపోతున్న కార్యకర్తలు**
**-సునీతా రెడ్డినే కోరుకుంటున్న కాంగ్రెస్ నాయకులు**

**బంట్వారం, మార్చ్,19 ప్రభాతవార్త :**
ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ పార్టీలు పార్లమెంట్ సమరామానికి సిద్దమైతున్న నేపథ్యంలో పార్టీలు మారుతున్న నాయకుల తీరుతో క్షేత్ర స్థాయిలోని కార్యకర్తలు, నాయకులు జుట్లు పీకుంటున్నారు. రాజకీయాలలో శాశ్వత శత్రువులు,అంటూ ఉండరని చెపుతున్నప్పటికీ, అవి గ్రామ స్థాయిలోని పార్టీ కార్యకర్తల పై న తీవ్ర ప్రభావాన్ని ఇందుకు చెవెళ్ళ ఎంపీ రంజీత్‌రెడ్డి బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి చేరడంతో మండల నాయకులు, కార్యకర్తలలో గందర గోళం నెలకొంది. ప్రస్తుతం గత మూడు నెలల క్రితమే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యార్థుల గెలుపు కొరకు ఒకరినొకరు, తిట్టు కున్న గ్రామాల్లోని కార్యకర్తలు నేడు ఏం చేయాలని మదనపడుతున్నారు. వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ నుండి గడ్డం ప్రసాద్ కుమార్, బీఆర్ఎస్ అభ్యర్థిగా మెతుకు ఆనంద్‌లు బరిలో ఉన్నారు. ఐతే అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆరేస్ అభ్యర్థి ఆనంద్ పట్ల మండలంలో కార్యకర్తలు అంత ఉత్సహంతో పని చేయలేకపోయేవారు. దీన్ని గమనించిన అధిష్టానం ఆనంద్ గెలుపు బాధ్యత ను ఎంపీ రంజిత్ రెడ్డికి అప్పగించింది. దీంతో ఎంపీ రంజిత్ రెడ్డి ఎలాగైనా ఆనంద్‌ను గెలిపించి కెసిఆర్ కు కా నుకగా ఇవ్వాలనే సంకల్పంతో గట్టి ప్రయత్నాలు చేశారు. గ్రామాల్లోని ప్రతి కార్యకర్తలకు మీకు నేను అండగా ఉంటానని చెప్పి బరోసా ఇచ్చారు. దీంతో కార్యకర్తలు బీఆర్ఎస్ గెలుపుకు పని చేశారు. యువకులు, సీనియర్‌లు కాంగ్రెస్ కార్యకర్తలకు నిదుర లేకుండా చేశారు. ఎంపీ రంజీత్‌రెడ్డి పార్టీ పిరాయింపులకు పాల్పడి కాంగ్రెస్ కార్యకర్తల ను సైతం బీఆరేస్‌లోకి చేర్చుకోవడం సవాలుగా మారింది. దీన్ని తీవ్రంగా భావించిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ప్రతి సవాలుగా తీసుకొని కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్ కుమార్‌ను గెలిపించుకోవాలని కంకణం కట్టుకున్నారు. రాజకీయంలో ప్రసాద్ గెలుపు అనేది జీవన్మరణ సమస్యగా భావించారు. దీంతో తమ తమ అభ్యర్థుల గెలుపు కొరకు పని చేస్తున్న కార్యకర్తలు ఎంపీ రంజిత్ రెడ్డిపై తీవ్ర ద్వేశాన్ని పెంచుకున్నారు. పలు చోట్ల కార్యకర్తలు ఒకరినొకరిని తిట్టుకోవడం, గల్లాలు పట్టుకొనేంత వరకు వచ్చింది. ఎలాగోలాగ ఎన్నికల ు పూర్తీ చేశారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అబ్యార్థి గెలుపొందడం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం జరిగింది. అంతేకాక ప్రసాద్ కుమార్‌కు స్పీకర్ పదవి రావడం జరిగింది. ఇప్పటి వరకు బాగానే ఉన్న, పార్లమెంట్ ఎన్నికల వేళా బీఆర్ఎస్ ఎంపీ కాంగ్రెస్‌లోకి రావడం, తిరిగి చేవెళ్ల అభ్యర్థిగా పోటీలో ఉండబోతున్నారనే వార్తలు రావడం జరుగుతుంది. ఈ విషయంలో మండలం కాంగ్రెస్ నాయకులు ప్రస్తుతం ఎటు తేల్చుకోలేక పోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమపైనే యుద్ధం ప్రకటించినట్లు ఉరుకులు, పరుగులు పెట్టించిన వారికి పని చేయాలా, వారి గెలుపు కొరకు మరొకరితో ఇప్పుడు పోటీ పడి గెలిపించాలా అంటూ ఒకరికొకరు చర్చించుకుంటున్నారు. ఇదే చేవెళ్ల బరిలో జెడ్పి చైర్పర్సన్ సునీతారెడ్డి ఉంటె అది మరోలా ఉంటుందని పేర్కొంటున్నారు. ఏది ఏమైనా అధిష్ఠానం నిర్ణయాలకు క్షేత్ర స్థాయిలోని కార్యకర్తలు ఇలా అ నుభవించాలా అంటూ ప్రశ్నించుకుంటున్నారు. రంజీత్‌రెడ్డి రాకతో కాంగ్రెస్ రెండు వర్గాలుగా చీలిపోవడం ఖాయమంటున్నారు కార్యకర్తలు. ఎదురెదురుగా పోటాపోటిగా పనిచేసిన ఇరు పార్టీల కార్యకర్తలు నేడు కలిసి పనిచేయడం ఎంతవరకు పనిచేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎవరు ఉన్నప్పటి ఎవరు గెలుపువారిదే, మనం మాత్రం పేరుకు మాత్రామే పని చేయాలి అని చెప్పుకుంటుండం కొసమెరుపు.

**పార్టీ పిరాయించే వారు మా వద్దకు రాకూడదు**

పూటకొక పార్టీలో చేరే నాయకులు మావద్దకు రాకూడదని బీఆర్ఎస్ కార్యకర్తలు తీవ్రంగా మండి పడుతున్నారు. ఎంపీ రంజిత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో నేనే మీకు, మీరు నాకు అంటూ సాకులు చెప్పి, నేడు పార్టీ మారడం ఏంటని అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పుడు తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు మరో నాయకుడు వచ్చి ఎదో సాకులు చెప్పి పని చేయించుకుంటారు అంటు అదిష్టానం తీరును తప్పుపడుతున్నారు.ఇది ఇలాగే ఉంటె పార్టీలో ఎవరు ఉండరని వాపోతున్నారు. నాయకులు అంకితాభావంతో పనిచేసి, కార్యకర్తలకు ఆదర్శంగా ఉండాలని, అలాంటప్పుడే పార్టీలు నాలుగు కాలాలపాటు మనుగడ సాగిస్తాయని పేర్కొంటున్నారు.

## కొనసాగుతున్న శ్రీ రామేశ్వర వీరాంజనేయ క్షేత్రంలో విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు

**-ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో నడవాలి**
**-ప్రముఖ సినీనటుడు తల్వార్ సుమన్‌గౌడ్**



ప్రత్యేక పూజలో పాల్గొన్న ప్రముఖులు, గ్రామ ప్రజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రముఖ సినీ నటుడు తల్వార్ సుమన్‌గౌడ్, శేషగిరిరావు, లీలా లక్ష్మారెడ్డి దంపతులు

**కడ్తాల్,మార్చి 19 ప్రభాతవార్త :**
మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో ప్రకృతి రమణీయ కొండల మధ్య వెలసిన శ్రీరామేశ్వర వీరాంజనేయ క్షేత్రంలో, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకులు కార్పోలు లీలా లక్ష్మారెడ్డి దంపతుల సహకారంతో నూతనంగా నిర్మాణం గావించుకున్న ఆలయంలో మంగళవారం ఉదయం లీలా లక్ష్మారెడ్డి దంపతులు, ప్రముఖ సినీ నటుడు తల్వార్ సుమన్‌గౌడ్, బట్టర్‌ప్లై సిటి మేనేజింగ్ డైరెక్టర్ అండ్ ఛైర్మన్ శేషగిరిరావు, ఆలయ అర్చకులు గణపతిపూజ, చతుర్థశ, కలశ అభిషేకం, జలాదివాసం, ఆదివాసత్రయ హోమం, పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సినీ నటుడు తల్వార్ సుమన్‌గౌడ్ మాట్లాడుతూ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకురాలు లీలా లక్ష్మారెడ్డి పర్యావరణ కోసం నిరంతరం చెట్లను పెంచుతూ, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి, అనుమసుపల్లి గ్రామంలో శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం, సరస్వతి శివపార్వతుల విశ్వప్రతిష్ట నిర్వహించి ప్రతి ఒక్కరు భక్తిమార్గంలో నడిపిస్తున్నటువంటి లీలా లక్ష్మారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన ప్రముఖులను లీలా లక్ష్మారెడ్డి దంపతులు , ఆలయ అర్చకులు శాలువాతో సన్మానం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు తల్వార్ సుమన్‌గౌడ్, బట్టర్‌ప్లై సిటీ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ ఛైర్మన్ శేషగిరిరావు, ఈడి రమేష్, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవిందర్, మాజీ సర్పంచ్ పోతుగంటి శంకర్, ఆలయ అర్చకులు గ్రామ భజన బృందం గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

# బంట్వారం మండల అభివృద్ధిపై స్పీకర్ ప్రత్యేక దృష్టి

**-సుమారు మూడు కోట్లతో సిసి రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి**
**-త్వరలో పిఆర్, ఆర్అండ్‌బి రోడ్ల అభివృద్ధి**
**-ఎంపీపీ ప్రభాకర్, పార్టీ అధ్యక్షుడు పోచారం వెంకటేశంలు**




విలేఖరులతో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రభాకర్, పార్టీ అధ్యక్షుడు పోచారం వెంకటేశం

**బంట్వారం, మార్చ్ 19 ప్రభాతవార్త :**
గత పదియేండ్లుగా నిరాదరణకు గురైన బంట్వారం మండల అభివృద్ధికి నేడు రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యేక దృష్టి పెట్టి కోట్లాది నిధులు అందిస్తున్నారని ఎంపీపీ ప్రభాకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోచారం వెంకటేశంలు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోవారు మాట్లాడుతూ ఇప్పటివరకు మండలానికి 2 కోట్ల 82 లక్షల నిధులతో సిసి రోడ్ల నిర్మాణం చేయడం జరిగిందని వారు చెప్పారు. ప్రతి గ్రామంలో రూ.10.00లక్షల నుండి రూ.60.00లక్షల నిధులతో సిసి రోడ్డుప నులు మంజూరు చేసి, పనులు సైతం పూర్తి చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాలకు ఉన్న లింకు రోడ్లు పిఆర్, ఆర్అండ్‌బి రోడ్ల ను అభివృద్ధి చేసేందుకు ఇప్పటికె ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. త్వరలో వాటి పనులు సైతం ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు చెప్పారు. వీటిలో తొరుమా మిడి-యాచారం ఆర్అండ్‌బి రోడ్డును డబుల్ లైన్‌గా మారుస్తారన్నారు. అదేవిధంగా పంచాయ తీరాజ్ రోడ్లు నూతనంగా బండమీదిపల్లి గేట్ నుండి బొప్పనారం వరకు, బస్వ పూర్-తొరుమామిడి సబ్‌స్టేషన్ వరకు రిబీటి నిర్మాణం పనులు చేయనున్నారు. కాల్‌ఖోడ-బంట్వారం, బంట్వారం-కొల్లంబసవేశ్వర టెంపుల్ వరకు, బంటా రం-కొత్తపల్లి, బుగ్గపూర్-మాద్వపూర్ రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు ప్రతిపా దనలు చేయడం జరిగిందని చెప్పారు. వీటి నిర్మాణం సహితం త్వరలో చేపట్టను న్నట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, పార్టీ నాయకు లు యాదగిరి, పురుషోత్తం, సంగమేశ్వర్, రాధాకృష్ణ గౌడ్, సంజీవ్, ఇసాక్, శ్రీనివాస్, సిద్ధిరాములు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు...

**- ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల సమాక్షంలో**
**పార్టీలో చేరుతున్న నాయకులు**
**- మాజీ సర్పంచులు, ఎంపీటీసీల చేరికలు**



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న చౌలపల్లి మాజీ సర్పంచి, తదితరులు

**షాద్‌నగర్, మార్చి 19, (ప్రభాతవార్త) :**
పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్శి వంశీచంద్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిలు పావులు కదుపుతున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తు ఇతర పార్టీల నాయకులను విరివిగా పార్టీలో చేర్చుకుంటున్నారు. అందులో భాగంగానే మంగళవారం ఫరూక్‌నగర్ మండలం చౌలపల్లి, గంట్లవెల్లి మాజీ సర్పంచులు నుస్రత్ రుక్సానా, కర్రోళ్ల యాదమ్మయాదయ్యలతో పాటు సుమారు 90 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోచేరారు. పార్టీ కార్యాయలంలో ఎమ్మెల్యే సమాక్షంలో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భారీగా చేరిన ఇతర పార్టీల నాయకులకు వారు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పార్టీకి పూర్వ వైభవం వస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి చేపతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని వారు పేర్కొన్నారు. గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ గ్రామాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని నేడు వారి నుంచి విముక్తిని పొందుతూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పాలమూరు అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడం ఖాయమని, అందుకు ప్రతి కార్యకర్త కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పాలమూరు బీజేపీ అభ్యర్థి డికె అరుణ గెలుపు తథ్యం

**- షాద్‌నగర్ బీజేపీ నాయకులు**
**- డికె అరుణను సన్మానించిన నాయకులు**



డికె అరుణమ్మను సన్మానిస్తున్న షాద్‌నగర్ నాయకులు.

**షాద్‌నగర్, మార్చి 19, (ప్రభాతవార్త) :**
వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొంది ముచ్చటగా మూడో సారి నరేంద్రమోడీ అధికారం చేపట్టడం ఖాయమని, అదేవిధంగా పాలమూరు బీజేపీ అభ్యర్థి డికె అరుణమ్మ గెలుపు తథ్యమని షాద్‌నగర్ బీజేపీ పార్టీ నాయకులు అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లో జరిగిన పార్టీ కార్యక్రమానికి షాద్‌నగర్ బీజేపీ నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి అరుణమ్మను శాలువ, పుష్పగుచ్చంతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ... రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ ఘన విజయం సాధిస్తుందని అన్నారు. 400 సీట్లు లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేస్తున్నారని, మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో అరుణమ్మను గెలిపించి నరేంద్రమోడీ విజయానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అందెబాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, నర్సింహ్మా, వెంకటేష్‌గుప్త, భూపాలచారి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అన్నదానం

**శామీర్‌పేట, మార్చి 19, ప్రభాతవార్త**
శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరుగగా, ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు పూజలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. శామీర్‌పేటకు చెంది ఇలాసాగరం రమేశ్-అరుణ దంపతులు వారి కుటుంబ సభ్యులు ప్రణయ్, సోనీ, విజయవాడకు చెందిన పెనుమారల నిర్మల కుమారి-మారుతి దంపతులు అలాగే సాయి ,పోషిత, కృష్ణపూజ, ప్రవీణ్, మాదవ్, శామీర్‌పేటకు చెందిన యాస్కి శ్రీనివాస్ గౌడ్-విజయలక్ష్మి దంపతులు, యాస్కి శోభన్‌గౌడ్-వసంత దంపతులు వారి కుటుంబసభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శామీర్‌పేట గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. దీనిలో గౌడసంఘం సభ్యులతో పాటు భక్తులు, ప్రజాప్రతినిదులు, మాజీ ప్రజాప్రతినిధులు,పలువురు తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారి దర్శించుకున్నారు.



.శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం జరిగిన దృశ్యం

## పోతాయిపల్లి వార్డులో పర్యటించిన కమిషనర్

**-ప్రజల సమస్యలు తెలుసుకున్న వైనం**



పోతాయిపల్లిలో పర్యటించిన తూంకుంట మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, కౌన్సిలర్, సిబ్బంది

**శామీర్‌పేట, మార్చి 19, ప్రభాతవార్త**
పోతాయిపల్లిలో (15వ వార్డు) తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, సంబంధిత అధికారులు పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. మంగళవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని పోతాయిపల్లి 15వ వార్డులో అధికారులు వార్డు పర్యటన నిమిత్తం పర్యటించారు. పలు కాలనీలలో ప్రజలను కమిషనర్ కలిసి సమస్యలను తెలుసుకుని వీలైనంత త్వరగా పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలోని పార్కును, వ్యాయామ సెంటర్‌ను (క్రీడా ప్రాంగణంను) క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలని కమిషనర్ వెంకట గోపాల్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోతాయిపల్లి 15వ వార్డు కౌన్సిలర్ టి.హరిబాబుగౌడ్, తూంకుంట మున్సిపల్ డిఇఇ సునీత, ఎఇ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో ఆడిట్

**మేడ్చల్, మార్చి 19. ప్రభాతవార్త :**
మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జిల్లా అడిటింగ్ అధికారి వెంకటేశం ఆధ్వర్యంలో అధికారుల బృందం అడిట్ నిర్వహించారు. రెండు రోజుల పాటు ఈ అడిట్ నిర్వహించనున్నట్లు తెలిసింది. అడిట్ పూర్తి అయిన అనంతరమే వివరాలు వెల్లడిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. కాగా మేడ్చల్ మున్సిపాలిటీలో అవినీతి రాజ్యమేలుతున్నదని సోమవారం కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ 6వ వార్డు కౌన్సిలర్ మణికంఠ గౌడ్ ఆరోపించిన మరుసటి రోజే మున్సిపల్ కార్యాలయంలో ఆడిట్ జరుగడం మేడ్చల్‌లో చర్చనీయాంశంగా మారింది.

## రూ.9 లక్షలతో భూగర్భడ్రైనేజీ నిర్మాణం : చైర్‌పర్సన్



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావనియాదవ్

**ఘట్‌కేసర్, మార్చి 19, ప్రభాతవార్త:**
ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఆహర్నిషలు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర స న్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 13వ వార్డులో రూ.9 లక్షలతో చేపట్టిన భూగర్భడ్రైనేజీ నిర్మాణ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. సామాజిక ఆసుపత్రి ఎదురు వీధిలో గత కొని న సంవత్సరాలుగా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక నీరు రోడ్డుపైన ప్రవహిస్తుండటంతో స్థానికులు వర్ష ం వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ నుంచి రూ.9 లక్షలు కేటాయించి ఇక్కడ పనులు చేపట్టామని గుంతల్లో మట్టి పూడ్చడంతో పాటు మిగిలిన మరమ్మత్తులు పూర్తి చేయాలని ఆమె కాం ట్రాక్టర్‌కు సూచించారు. స్థానిక కౌన్సిలర్ షేక్‌జహంగీర్, కుతాడి రవీందర్, మాజీ ఉపసర్పంచ్ యాదగిరియాదవ్, వర్క్ఇన్‌స్పెక్టర్ సన్నీ, రాకేశ్, నాయకులు సిరా జుద్దిన్‌లు ఉన్నారు.

## అక్రమ బ్లాస్టింగ్‌కు యత్నం..పేలుడు సామాగ్రీ సీజ్

**-ఇద్దరిపై కేసు నమోదు : సీఐ**



పోలీసులు స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు

**ఘట్‌కేసర్, మార్చి 19, ప్రభాతవార్త:**
బండరాళ్లను ధ్వంసం చేయడానికి అనుమతి లేకుండా బ్లాస్టింగ్‌కు యత్నించగా పోలీసులు అడ్డుకొని పేలుడు సామాగ్రిని స్వాధీనం చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్ సమీపంలోని విజ్ఞాన్ ఎడ్యుకేషన్ సొసైటీ పాఠశాల వెనుక ఉన్న బండరాళ్లను తొలగించేందుకు బర్మాలు పెడుతున్నారని సమాచారం రావడంతో మల్కాజ్‌గిరి ఎస్ఓటీ, ఘట్‌కేసర్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అక్రమంగా జిల్టన్‌స్టిక్స్ అండ్ డిటోనేటర్స్‌తో బ్లాస్టింగ్ చేయడానికి ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకొని పరికరాలను సీజ్ చేశారు. పాఠశాల యాజమాన్యం సునీల్ అనే వ్యక్తికి రాళ్లను తొలగించాలని పని అప్పగించగా పోచంపల్లి దేశ్‌ముఖ్ గ్రామానికి చెందిన మల్లయ్య, యాదయ్యలతో బ్లాస్టింగ్ పనులు చేయిస్తున్నారు. అనుమతి లేకుండా బ్లాస్ట్ ంగ్ చేయడానికి యత్నించిన ఇద్దరిపై కేసు నమోదు చేసి సామాగ్రిని సీజ్ చేశారు. జీళ్తెన్సిక్స్ 16, డిటోనేటర్లు 19, టాటా హిటాచీ, రెండు మొబైల్ ఫోన్స్‌లను స్వాధీనం చేసుకున్నామని అక్రమంగా పేలుళ్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సైదులు స్పష్టం చేశారు.